కొండారెడ్డిపల్లికి కొత్త శోభ



ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

వంగూరు, కల్వకుర్తి, న్యూస్‌టుడే : ముఖ్యమంత్రి హోదాలో ఎనుముల రేవంత్‌రెడ్డి తొలిసారి స్వగ్రామం కొండారెడ్డిపల్లికి దసరా పండగ రోజు రావటం కొత్త శోభ సంతరించుకుంది. శనివారం మధ్యాహ్నం ప్రత్యేక హెలికాప్టర్‌లో చేరుకున్నారు. గజమాలలతో గ్రామస్థులు ఆయనకు ఘనస్వాగతం పలికారు. వాహనంలో రోడ్డు వెంట పూలవర్షం కురిపిస్తూ కోలాటాలు, బతుకమ్మలతో ఊరేగింపు నిర్వహించారు. గ్రామంలో సందడి వాతావరణం నెలకొంది. రాష్ట్ర ముఖ్యమంత్రి అయినా గ్రామస్థులు, బంధువులను మర్చిపోకుండా పేరుపేరునా పలుకరించడం ప్రత్యేకతను సంతరించుకుంది. సీఎం పంచెకట్టుతో సాయంత్రం 6.30 గంటలకు ఇంట్లో నుంచి బయలుదేరి ఆయనే నిర్మించిన కోటమైసమ్మ ఆలయానికి చేరుకొని ప్రత్యేక పూజలు చేశారు. కొండారెడ్డిపల్లికి ముఖ్యమంత్రి వస్తున్నారని గ్రామానికి చెందిన ఆడబిడ్డలు,

ఆరు గంటలపాటు సీఎం పర్యటన

అల్లుళ్లు, బంధువులు రాకతో ఊరంతా జనసందోహంతో కళకళలాడింది. ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్యే డా. వంశీకృష్ణ, మాజీ జడ్పీటీసీ సభ్యుడు కేవీఎన్‌రెడ్డి, స్థానిక ప్రజాప్రతినిధులు తదితరులు ఉన్నారు. అనంతరం గ్రామ యువకులతో స్వీయచిత్రాలు దిగారు. ఆరుగంటలపాటు కొండారెడ్డిపల్లిలో ఉండి బంధువులు, గ్రామస్థులు, అభిమానులకు సమయమిచ్చారు. రాత్రి 8.15 గంటలకు ప్రత్యేక వాహనాల్లో కొడంగల్‌కు వెళ్లారు.

రూ. 50 కోట్లతో అభివృద్ధి పనులు..: గ్రామానికి చెందిన వ్యక్తి రేవంత్‌రెడ్డి రాష్ట్ర ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన వెంటనే కొండారెడ్డిపల్లికి నాలుగు వరుసల రహదారి ఏర్పాటుకు నిధులు మంజూరు చేయటం, నిత్యం జిల్లా అధికారులు గ్రామానికి వస్తుండటంతో ప్రజల్లో ఆనందాలు వెల్లివిరిసింది. రూ.50 కోట్లతో వివిధ అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టడంతో గ్రామ రూపురేఖలు మారిపోయాయి. అనేక వసతులు సమకూరాయని గ్రామస్థులు ఆనందం వ్యక్తం చేశారు.



జమ్మి పూజకు గ్రామస్థులతో తరలివెళ్తున్న రేవంత్‌రెడ్డి, పక్కన మల్లు రవి, డా.వంశీకృష్ణ

రాజరాజేశ్వరిదేవిగా మైసమ్మ



నవాబ్‌పేట,న్యూస్‌టుడే : మండలంలో శరన్నవరాత్రి ముగింపు ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. పర్వతాపూర్ మైసమ్మ దేవతను రాజరాజేశ్వరిదేవిగా అలంకరణ చేశారు. ఆలయ పూజారి శ్రీకాంత్‌శర్మ భక్తులచే పూజలు చేయించారు.

ఇళ్ల పంపిణీ ఇంకెప్పుడో..?

ఏళ్లుగా డబుల్‌బెడ్‌రూం లబ్ధిదారుల ఎదురుచూపులు



భూత్పూర్ : నర్సింగాపూర్‌లో నిర్మించిన రెండు పడకగదులు



పగిలిన కిటికీ అద్దాలు

భూత్పూర్, మెట్టుగడ్డ(మహబూబ్‌నగర్), న్యూస్‌టుడే : పేదవాడి సొంతింటి కల కలగానే మిగిలిపోతోంది. గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన రెండు పడక గదుల ఇళ్లు లబ్ధిదారులకు కేటాయించకుండానే శిథిలావస్థకు చేరుతున్నాయి. అర్హులైన ప్రతి కుటుంబానికి సొంతంగా ఇళ్లు ఉండాలనే తలంపుతో కేసీఆర్ హయాంలో ప్రభుత్వం మంజూరు చేసింది. జిల్లాలోని మున్సిపాలిటీలు, మండలాలు, గ్రామాల్లో ప్రభుత్వ స్థలాలను గుర్తించి పెద్ద మొత్తంలో ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. చాలా గ్రామాల్లో స్థలాల కొరత, గుత్తేదారుల అనాసక్తి లాంటి కారణాలతో ఇళ్ల నిర్మాణాలు నత్తనడకన సాగాయి. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంతోపాటు నియోజకవర్గంలోనూ 2,981 ఇళ్లు నిర్మించగా 2,667 లబ్ధిదారులకు పట్టాలు అందజేశారు. జడ్చర్ల, దేవరకద్ర నియోజకవర్గాల్లో ఇళ్ల నిర్మాణాలు, కేటాయింపులు అరకొరగానే మిగిలాయి.

ఒక్కటిలేదు.. : జిల్లాలోని కొన్ని మండలాల్లో రెండు పడక గదుల ఇళ్లకు సంబంధించి ఎలాంటి చర్యలు చేపట్టలేదు. దేవరకద్ర, హన్వాడ, మహ్మదాబాద్, గండీడ్, కోయిలకొండ మండలాల్లో ఒక్క ఇంటిని నిర్మించకపోవడం విశేషం.

ఎక్కడెక్కడ ఎన్ని..?

ప్రభుత్వ నిబంధనల మేరకు నిర్మించిన రెండు పడక గదులను కొన్ని గ్రామాలు, పట్టణాల్లో మాత్రమే లబ్ధిదారులకు కేటాయించినా చాలా చోట్ల సరైన వసతులు లేకపోవడంతో లబ్ధిదారులు అనాసక్తి చూపుతున్నారు. సౌకర్యాలు లేకపోవడం, ప్రభుత్వం మారడంతో అక్కడక్కడ కొన్ని ఇళ్లు నిర్మాణం పూర్తయినా కూడా లబ్ధిదారులకు పట్టాలు ఇవ్వకపోవడంతో ఉన్నచోటే శిథిలావస్థలకు చేరుతున్నాయి. దేవరకద్ర నియోజకవర్గంలోని భూత్పూర్ పురపాలిక పరిధిలోని నర్సింగాపూర్‌లో 24, కౌకుంట్ల మండలం పేరూరులో 80, జడ్చర్ల నియోజకవర్గంలోని మిడ్జిల్ మండలం కొత్తపల్లిలో 24, నవాబుపేట మండలంలోని తీగల్‌పల్లి 24, రుద్రారం 48 ఇళ్లు పంపిణీ చేయాల్సి ఉంది. ఎన్మన్‌గండ్లలో 24 ఇళ్లు మాత్రం లబ్ధిదారులకు కేటాయించినా ప్రభుత్వం మారిన తర్వాత పట్టాలను రద్దు చేశారు. రాజాపూర్ మండలం చొక్కంపేటలో 32, బాలానగర్ మండలంలోని పెద్దాయిపల్లిలో 40, గౌతాపూర్ 64 పూర్తయిన డ్రైనేజీ, విద్యుత్తు, తాగునీటి సౌకర్యం లేకపోవడంతో పట్టాలు ఇవ్వలేదు. జడ్చర్ల పట్టణం, మండలంలో 1,069 ఇళ్లు పూర్తికాగా 351 మాత్రమే పంపిణీ చేశారు. మహబూబ్‌నగర్ మున్సిపల్ పరిధిలో 314, మండలంలోని పత్తేపూర్‌లో 40, కోడూరు వద్ద 56 ఇళ్లు లబ్ధిదారులకు కేటాయించాల్సి ఉంది. ఇళ్ల కేటాయింపు విషయమై గృహ నిర్మాణ శాఖ ఈఈ భాస్కర్‌ను వివరణ 'న్యూస్‌టుడే' వివరణ కోరగా సెలవులో ఉన్నానని, తర్వాత వివరాలు వెల్లడిస్తామని చెప్పారు.

ఇష్టారాజ్యంగా మట్టి తవ్వకాలు

గద్వాల జిల్లాలో నిబంధనలు హుష్

ఈనాడు, మహబూబ్‌నగర్

మహారాష్ట్రలోని అక్కల్‌కోట నుంచి చెన్నై వరకు నిర్మిస్తున్న గ్రీన్‌ఫీల్డ్ జాతీయ రహదారి పనులు జోగులాంబ గద్వాల జిల్లాలో 77.5 కిలోమీటర్ల మేరకు సాగుతున్నాయి. ఈ పనుల కోసం కేంద్రం రూ.1,568 కోట్లు కేటాయించింది. పనుల్లో భాగంగా మొరం మట్టిని వాడాలి. ప్రస్తుతం వడ్డేపల్లి మండలంలో పనులు కొనసాగుతున్నాయి. జూలకల్ ప్రాంతంలో కొన్ని ఎకరాల్లోని వ్యవసాయ భూములను మొరం మట్టి పేరుతో ఇష్టారాజ్యంగా తవ్వేశారు. ఇందులో భాగంగా కొందరికి ఎకరాకు రూ.లక్షల్లో ముట్టజెప్పారు. ఈ గ్రామంలోనే ఉన్న ఓ గుట్టను చెరబట్టారు. ఆర్డీఎస్ కాలువ వెంట ఉన్న పలు భూములను జేసీబీ, పొక్లెయిన్లు, టిప్పర్లు పెట్టి 10 అడుగులకు పైగా గుంతలు తీస్తున్నారు. ఇటీవల పడిన వర్షాలతో ఈ ప్రాంతాల్లో కొత్త చెరువులు పుట్టుకొచ్చాయి.



ఈ చిత్రంలో కనిపిస్తున్నది చెరువనుకున్నారా? అయితే భ్రమ పడినట్లే. అచ్చం చెరువును తలపిస్తున్న ఈ ప్రాంతం ఏడాది క్రితం వరకు సాగు భూమి. కొన్ని ఎకరాల్లో ఉన్న ఈ భూమి చెరువుగా ఎలా మారిందని అనుకుంటున్నారా. మొరం మట్టి తవ్వడంతో ఈ పరిస్థితి నెలకొంది. వడ్డేపల్లి మండలం జూలకల్‌లోని ఆర్డీఎస్ కాలువకు సమీపంలోని భూములను ఈ ప్రాంతంలో వేస్తున్న భారత్‌మాల రహదారి కోసం తవ్వారు. ఇక్కడ పట్టా, సీలింగ్ భూముల్లో ఇష్టారాజ్యంగా తవ్వకాలు జరపడంతో ఎకరాలు ఎకరాలు చెరువులను తలపిస్తున్నాయి. సుమారు 10 అడుగుల లోతు వరకు భూమిని తవ్వి మొరం తరలించారు.



ఈ చిత్రంలో కనిపిస్తున్నది వడ్డేపల్లి గట్టు. దీనిపై మాధవ స్వామి ఆలయం కూడా ఉంది. ఒక్కప్పుడు 25 ఎకరాలకు పైగా ఈ గుట్ట విస్తరించి ఉండేది. జాతీయ రహదారి కోసమని అనుమతుల పేరుతో ఇష్టారాజ్యంగా తవ్వారు. ప్రస్తుతం 25 ఎకరాల గుట్ట పూర్తిగా మాయమయ్యే పరిస్థితి వచ్చింది. నిబంధనలకు విరుద్ధంగా తవ్వకాలు జరపడంతో జిల్లాలోనే ఎంతో గుర్తింపు ఉన్న ఈ గుట్ట ప్రస్తుతం మాయమయ్యే పరిస్థితి వచ్చింది.

● వడ్డేపల్లి గట్టు మాయమవుతోంది. ఇక్కడ మాధవస్వామి ఆలయం ఉంది. ఇక్కడి నుంచి కొన్ని లక్షల టన్నుల్లో మొరం మట్టిని తరలించారు. ఇక్కడి గుట్టను ఇష్టారాజ్యంగా తవ్వడంపై

యడం లేదు. బుడమర్సు, తనగలలోని గుట్టలను కూడా యథేచ్ఛగా తవ్వుతున్నారు. ఈ రెండు గ్రామాల్లోని ప్రధాన గుట్టలను ఖాళీ చేస్తున్నారు.

కిమ్మనని యంత్రాంగం : నిబంధనలకు విరుద్ధంగా తవ్వకాలు జరుగుతున్నా నాయకులు, అధికార యంత్రాంగం నోరెత్తడం లేదు. నియోజకవర్గంలో కీలకంగా ఉన్న కొందరు వ్యక్తులకు చేయితడుపుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. జరిమానాలు విధించామని భూగర్భ గనులశాఖ అధికారులు పైకి చెబుతున్నా అవన్నీ ప్రకటనలకు, కాగితాలకే పరిమితం. సాధారణంగా టన్ను మొరం మట్టికి రూ.35, రాళ్లకు రూ.80 వరకు సినరేజీ ఛార్జీలు చెల్లించాలి. గతంలో గట్టు, కేటీదొడ్డి మండలాల్లో తవ్వకాలు జరిగినప్పుడు విమర్శలు హోరెత్తడంతో సుమారు రూ.56కోట్ల వరకు జరిమానాలు విధించి అధికారులు చేతులు దులుపుకున్నారు. దీనిపై జోగులాంబ గద్వాల జిల్లా అదనపు కలెక్టర్(రెవెన్యూ) లక్ష్మీనారాయణను 'ఈనాడు' సంప్రదించగా క్షేత్రస్థాయికి అధికారులను పంపించి విచారణ చేయిస్తామని తెలిపారు.

పనిచేయని పరికరాలు.. అందని సేవలు

- తరచూ చెడిపోతున్న టీ హబ్ యంత్రాలు
- పర్యవేక్షణ లేకపోవడంతో అవస్థలు



మరమ్మతులు చేయని సిమెన్స్ యంత్రం

పాలమూరు, న్యూస్‌టుడే: మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని తెలంగాణ డయాగ్నొస్టిక్ కేంద్రంలో యంత్రాలు, వైద్య పరికరాలు సక్రమంగా పని చేయకపోవడంతో తరచుగా సమస్యలు తలెత్తుతున్నాయి. అధునాతన యంత్రాలపై పర్యవేక్షణ లేకపోవడంతోనే అవి మరమ్మతులకు గురవుతున్నాయి. దీంతో ఏ రోజుకారోజు రావాల్సిన రక్త నమునాల ఫలితాలు ఆలస్యంగా వస్తుండటంతో వైద్యం సకాలంలో అందక రోగులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. మహబూబ్‌నగర్ జిల్లాలోని అన్ని పీహెచ్‌సీలు, నారాయణపేట జిల్లాలోని కొన్ని పీహెచ్‌సీల ద్వారా రక్త నమూనాలను మహబూబ్‌నగర్ టీ హబ్‌కు పంపుతున్నారు. నిత్యం 500 నుంచి 600ల వరకు నమూనాలు ఇక్కడికి వస్తున్నాయి. ఇక్కడ 20 రోజుల నుంచి సిమెన్స్ యంత్రం పని చేయడం లేదు. దీంతో నమూనాలను గద్వాల, వనపర్తికి పంపి అక్కడ పరీక్షలు చేసిన అనంతరం రెండు, మూడు రోజుల తరువాత ఫలితాలు బాధితులకు అందుతున్నాయి. లివర్, కిడ్నీ, కొవ్వు, మధుమేహం, కాల్షియం, అమలైజ్‌సిరం, తదితర వాటికి సంబంధించిన పరీక్షలు నిలిచిపోయాయి.

సిబ్బందిపై ఆగ్రహం..

టీ హబ్‌లో యంత్రాలు పని చేయడం లేదనే విషయాన్ని 'న్యూస్‌టుడే' ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. సంపత్‌కుమార్ సింగ్‌కు దృష్టికి తీసుకెళ్లింది. దీంతో ఆయన నేరుగా ఆర్ఎంవో డా. జరీనాతో కలిసి టీ హబ్‌ను సందర్శించారు. పని చేయని యంత్రాల గురించి తనకు సమాచారాన్ని ఎందుకు చెప్పలేదని వారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం రికార్డులను పరిశీలించారు.

పీటీఎన్ఆర్ పరీక్షలకు బయటకు..

టీ హబ్‌లో గర్భిణులకు సంబంధించిన అతి ముఖ్యమైన పీటీఎన్ఆర్ సేవలు అందడం లేదు. ఆ యంత్రం కూడా కొద్ది రోజుల నుంచి పని చేయడం లేదు. నిత్యం కనీసం 10 మంది గర్భిణులకు సంబంధించిన పరీక్షలు టీ హబ్‌కు వస్తాయి. కానీ ఇక్కడ యంత్రం పని చేయకపోవడంతో ప్రైవేట్ ల్యాబ్‌లకు వెళ్లక తప్పడం లేదు. బయట ఒక్క పరీక్ష చేయడానికి రూ. 2500ల వరకు ఖర్చు అవుతుండటంతో బాధితులు ఇబ్బందులు పడుతున్నారు. ఇతర అతి ముఖ్యమైన పరీక్షలు అందకుండా పోతున్నాయి.



యంత్రంలో పని చేయని భాగాన్ని సూపరింటెండెంట్ డా.సంపత్‌కుమార్ సింగ్‌కు వివరిస్తున్న వైద్య సిబ్బంది

వెంటనే మరమ్మతులు చేయిస్తాం

సాధ్యమైనంత త్వరగా యంత్రాలకు మరమ్మతులు చేయించి అందుబాటులోకి తెస్తాం. యంత్రాలకు సంబంధించిన విభాగాలు కూడా కొరియర్‌లో వచ్చాయని, వెంటనే వాటికి మరమ్మతులు చేయించేలా చర్యలు తీసుకుంటాం.

- ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.సంపత్‌కుమార్ సింగ్

ఇక మెరుగైన పౌష్టికాహారం

- 312 ప్రభుత్వ పాఠశాలల్లో మంచి భోజనం
- సీఎం నియోజకవర్గంలో పైలెట్ ప్రాజెక్టు



న్యూస్‌టుడే, కోస్గి

ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడమే కాకుండా, విద్యార్థులకు మరింత మెరుగైన పౌష్టికాహారాన్ని అందించాలని ప్రభుత్వం భావిస్తోంది. చాలా పాఠశాలల్లో మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం అందించడంలేదనే విమర్శలు ప్రస్తుతం ఉన్నాయి. ఈ క్రమంలో విద్యార్థులకు ఒకేచోట నాణ్యమైన భోజనాన్ని తయారుచేసి అన్ని పాఠశాలలకు అందించాలని, దీంతో విద్యార్థులందరికీ బలవర్ధకమైన పౌష్టికాహారం అందుతుందని భావించారు. పైలెట్ ప్రాజెక్టుగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సొంత నియోజకవర్గమైన కొడంగల్‌ని ఎంపిక చేశారు. నియోజకవర్గంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఒకటి నుంచి పదో తరగతి వరకు చదువుకుంటున్న విద్యార్థులకు అల్పాహారం, మధ్యాహ్న భోజనం అందించనున్నారు. ఇందుకోసం అక్షయపాత్ర సంస్థ బాహుబలి వంటషెడ్‌ను కొడంగల్ మార్కెట్ యార్డులో ఏర్పాటు చేస్తున్నారు. ఈ నెలాఖరుకు దీని నిర్మాణం పూర్తిచేసి, విద్యార్థులకు భోజనం అందించాలని అధికారులు ప్రయత్నిస్తున్నారు. ఈ నియోజకవర్గంలో విజయవంతమైతే రాష్ట్రవ్యాప్తంగా అమలు చేయనున్నారు. వంటగది నిర్మాణానికి రూ.4 కోట్లు వెచ్చించనున్నారు. హరేరామ హరేకృష్ణ ఫౌండేషన్ రూ.2 కోట్లు, సీఎస్ఆర్ ఫౌండేషన్ రూ.2 కోట్లు వెచ్చిస్తోంది. ఇప్పటికే నిర్మాణం ఒక కొలిక్కి వచ్చింది. కొంతమేర సామగ్రి సైతం చేరుకుంది. పనులను వేగంగా పూర్తిచేసి అందుబాటులోకి తేవాలని అధికారులు యోచిస్తున్నారు.

● కొడంగల్ నియోజకవర్గం పరిధిలో నారాయణపేట జిల్లాలోని కోస్గి, మద్దూరు, గుండుమాల్, కొత్తపల్లి మండలాలు, వికారాబాద్ జిల్లాలోని కొడంగల్ దౌల్తాబాద్, బొంరాస్‌పేట, దుద్యాల మండలాలు ఉన్నాయి. మొత్తం 312 ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు కొడంగల్ నుంచి మధ్యాహ్న భోజనంతో పాటు అల్పాహారం అందించనున్నారు. 28 వేల మంది విద్యార్థులకు ప్రయోజనం కలగనుంది. ఈ నెలాఖరు నుంచి కొత్త మెనూప్రకారం భోజనం అందిస్తామని కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి 'న్యూస్‌టుడే'తో అన్నారు.



కొడంగల్‌లో నిర్మిస్తున్న భారీ వంటశాల



నిత్యం నరకయాతనే..!

జాతీయ రహదారుల వెంట ఉన్న ఉపరహదారుల నిర్వహణ అధ్వానంగా మారింది. అయిదేళ్లకోసారి ఉపరహదారుల నిర్వహణ చేపట్టాల్సి ఉన్నా నిర్వహణ సంస్థ మరమ్మతులు చేయకపోవడంతో రహదారులు గుంతలమయంగా దర్శనమిస్తున్నాయి. భూత్పూర్ కూడలిలోని జడ్చర్ల వెళ్లే దారి తారులేచి అధ్వానంగా తయారైంది. ముఖ్యంగా మహానీయుల విగ్రహాలు ఏర్పాటు చేసిన చోట రోడ్డు మోకాలిలోతు గుంతలు పడ్డాయి. దీంతో నిత్యం రాకపోకలు సాగించే వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైనా నిర్వహణ సంస్థ అధికారులు స్పందించి గుంతలను పూడ్చివేసి, మరమ్మతు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

న్యూస్‌టుడే, భూత్పూర్


సుంకేసులకు పెరిగిన వరద

రాజోలి : ఎగువన కురుస్తున్న వర్షాల కారణంగా సుంకేసుల జలాశయానికి వరద ప్రవాహం పెరిగింది. ఆదివారం ఎగువ నుంచి 44,700 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోంది. దీంతో 10 గేట్లను ఒక మీటరు మేర ఎత్తి 42,070 క్యూసెక్కుల నీటిని దిగువనున్న శ్రీశైలం జలాశయానికి విడుదల చేస్తున్నట్లుగా డ్యాం అధికారులు తెలిపారు. కర్నూలు వైపున్న కేసీ కాలువకు 2400 క్యూసెక్కులు వదులుతున్నామని, ప్రస్తుతం జలాశయంలో 291.20 మీటర్ల నీటిమట్టం నమోదైనట్లుగా పేర్కొన్నారు.


కేఎల్ఐ డి-82 కాల్వకు గండి

చారకొండ : చారకొండ మండలం జూపల్లి గ్రామ సమీపంలో కల్వకుర్తి ఎత్తిపోతల పథకం డి-82 ప్రధాన కాల్వకు శుక్రవారం రాత్రి గండిపడింది. ఇటీవల కేఎల్ఐ ద్వారా సాగునీటిని దిగువకు విడుదల చేయడంతో కాల్వ నిండుగా పారింది. డి-82 ప్రధాన కాల్వ 15కిలో మీటరు వద్ద గండి పడటంతో కాల్వలోని నీరంతా సమీప చింతచెరువు, తూము చెరువు, కుమ్మరికుంటలు నిండి అలుగు పారుతున్నాయి.

పది మొక్కల లక్ష్యం.. ఇచ్చింది ఫలితం



ధరూరు ఉన్నత పాఠశాల ఆవరణలో పచ్చదనం



ఏపుగా పెరిగిన మొక్కలు

ధరూరు, న్యూస్‌టుడే: ఇంట్లో నుంచి బయటకు వెళ్తే తిరిగి ఇంటికి వచ్చే లోపు కరోనా మహమ్మారి ఎక్కడ కబళిస్తుందోనన్న భయంతో బతుకుతున్న రోజులు.. ధరూరు పాఠశాల ఉపాధ్యాయులదీ అదే పరిస్థితి. రోజూ 1,150 మంది విద్యార్థుల మధ్య తిరుగుతూ నిత్యం కళకళలాడే పాఠశాల బోసిపోయిన తీరు. ఆ సమయంలో ఏదీ తోచని ఉపాధ్యాయులకు ఓ చక్కటి ఆలోచన వచ్చింది. ప్రధానోపాధ్యాయులకు వివరించి ఆయన నిర్ణయంతో అమలుకు ముందుకేశారు. గ్రామ మాజీ సర్పంచి సహకారంతో పాఠశాలలో మొక్కలు నాటి వాటి సంరక్షణ చర్యలకు శ్రీకారం చుట్టారు. ఉపాధ్యాయులే తలా ఇంత పోగేసి దాతల సహకారంతో రూ.లక్ష వరకు వెచ్చించి కడియం నర్సరీ నుంచి ప్రత్యేకంగా మొక్కలు తెప్పించారు. తలా పది మొక్కలు దత్తత తీసుకొని కరోనా అంతరించి పోయి పాఠశాలలు తెరిచే దాకా సంరక్షిస్తూ నీరందించారు. ఎవరికి వారు తాము దత్తత తీసుకున్న పదిమొక్కల పెంపకం పూర్తి బాధ్యతలు ఇప్పటికీ నిర్వర్తిస్తున్నారు. రెండేళ్లు గడిచే సరికి పాఠశాల పచ్చదనపు కళతోపాటు చల్లదనాన్ని, స్వచ్ఛమైన గాలిని ఇస్తోంది. చెట్లను చూస్తే తృప్తిగా అన్పిస్తుందని ఉపాధ్యాయులంటున్నారు.



హంస వాహనంపై జలవిహారం



అలంకరణలో ఉత్సవమూర్తులు



నదిహారతులు ఇస్తున్న అర్చక స్వాములు

వైభవం..జోగులాంబ తెప్పోత్సవం!

అలంపూర్, న్యూస్‌టుడే: శక్తి పీఠంలో దసరా ఉత్సవాలు విజయ దశమితో ముగిశాయి. ముగింపు సందర్భంగా శనివారం తుంగభద్ర నదిలో తీర్థవలి నిర్వహించారు. దేవతమూర్తుల విగ్రహాలతో పాటుగా భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు. రాత్రి హంస వాహనంపై తెప్పోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. దేవతామూర్తులు ఆహ్లాదకరమైన వాతావరణంలో నదిలో విహరించారు. తిలకించేందుకు వేల సంఖ్యలో భక్తులు తరలి రావడంతో పుష్కర్‌ఘాట్ కిక్కిరిసిపోయింది. ఉత్సవం సందర్భంగా నదీ హారతి ఇచ్చారు. కలెక్టర్ సంతోష్ దంపతులు, ఎమ్మెల్యే విజయుడు, ఈవో పురేందర్, ఆలయ ఛైర్మన్ నాగేశ్వర్‌రెడ్డి తదితరులు హాజరయ్యారు. పూర్ణాహుతి కార్యక్రమంతో ఉత్సవాలను ముగించారు. 108 రకాల సుగంధ ద్రవ్యాలు, వన మూలికలు, పట్టువస్త్రాలు ఆహుతి ఇచ్చారు. ధ్వజావరోహణ కార్యక్రమం నిర్వహించారు. హంసవాహనంలోకి కేవలం కలెక్టర్ దంపతులు, ఎమ్మెల్యే, ఆలయ ఛైర్మన్‌కు మాత్రమే అవకాశం కల్పించారు. ధర్మకర్త సభ్యులు వెళ్తుండటంతో పోలీసులు అడ్డుకున్నారు. తమకే అవకాశం కల్పించకపోతే ఎలా అంటూ వారు ఆవేదన వ్యక్తం చేశారు.



భక్తజనంతో కిక్కిరిసిన పుష్కరఘాట్



మూర్తులకు పుణ్యస్నానాలు



ఆలయంలో భక్త జనసందోహం

ప్రభుత్వ గోదాముల్లోనే ధాన్యం నిల్వ!

ధరూరు, మల్దకల్, న్యూస్‌టుడే: రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యం మిల్లులకు తరలించడం వాటిని కస్టం మిల్లింగ్ చేసిన తర్వాత తిరిగి ప్రభుత్వానికి అప్పగించటంలో అనేక లోపాలు, అక్రమాలు జరుగుతున్న నేపథ్యంలో ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇక మీదట రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యం నేరుగా ప్రభుత్వ గోదాములకు తరలించి నిల్వ చేయాలని నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు పౌరసరఫరాల శాఖ చేసిన ప్రతిపాదనలకు వ్యవసాయ శాఖ ఆమోదం తెలిపింది. త్వరలోనే దీనికి సంబంధించి ఉత్తర్వులు వెలువడనున్నట్లు తెలిసింది.



కుర్తిరావల్ చెర్వు వద్ద నిర్మించిన 5 వేల మెట్రిక్ టన్నుల ప్రభుత్వ గోదాం

గతంలో ఇలా..

వరి ధాన్యం నేరుగా మిల్లులకే కేటాయించటం కస్టమ్ మిల్లింగ్ ద్వారా తిరిగి వారి నుంచి బియ్యం తీసుకోవటం చేసేవారు. ఈ విధానం మిల్లర్లకు పలు విధాలుగా ప్రయోజనం ముందుండటంతో పాటు మార్గదర్శకాల్లో మార్పులు చేయాలని పట్టుబట్టుతుండటంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. ప్రభుత్వ నిర్ణయం వెనక మరో అంశం కూడా ఉన్నట్లు సమాచారం. గతంలో మిల్లులు కేటాయించిన ధాన్యాన్ని మిల్లర్లు బహిరంగ మార్కెట్లకు తరలించి అమ్ముకొంటూ వాటి స్థానంలో పీడీఎస్ లేదా ఇతర చోట్ల నుంచి సేకరించిన బియ్యం ప్రభుత్వానికి ఇవ్వడం జరిగింది. కొన్ని మిల్లుల నిర్వాహకులు ధాన్యం నిల్వలను పక్కదారి పట్టించి బియ్యం ఇవ్వలేక బకాయిపడ్డారు. వారిపై క్రిమినల్ కేసులు నమోదు, ఆస్తుల జప్తునకు కలెక్టర్లు చర్యలు తీసుకున్న విషయం తెలిసిందే.

అవసరమున్న మేరకే మిల్లింగ్

కొనుగోలు చేసిన ధాన్యం వ్యవసాయ మార్కెట్ కమిటీల పరిధిలో ఉన్న గోదాములు, స్టేట్ వేర్ హౌసింగ్ గోదాముల్లో నిల్వ చేయనున్నారు. అయితే ఇప్పటికే వాటిని ఇతరులకు లీజుకు ఇచ్చి ఉంటే వాటిని ఖాళీ చేయించి వరి ధాన్యం నిల్వకు ఉపయోగించనున్నారు. జిల్లాలు, మండలాల వారీగా వచ్చే ధాన్యాన్ని సమీపంలో వ్యవసాయ శాఖ గోదాములకు తరలించి నిల్వ చేస్తారు. రైస్ మిల్లర్లతో సమస్య పరిష్కారం అయిన తర్వాత వారికి కేటాయించే అవకాశం ఉంది. ధాన్యం మిల్లులకు కేటాయింపుల్లో కూడా ఈసారి మార్పులు చోటుచేసుకోనున్నట్లు తెలిసింది. సంక్షేమ పథకాలకు అవసరం ఉన్న మేర మాత్రమే మిల్లింగ్ చేయించి మిగిలిన వరిధాన్యం బహిరంగ వేలం ద్వారా విక్రయించనున్నట్లు సమాచారం.



నేటికి మంచి రోజులు

గత ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ స్థలాలు అందుబాటులో ఉన్న చోట మండలానికి 5వేల మెట్రిక్ టన్నులు, సాగు విస్తీర్ణం ఎక్కువగా ఉన్నచోట 10 వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యం ఉన్న గోదాములను నిర్మించారు. వాటిలో చాలా వరకు వినియోగంలోకి రాలేదు. గద్వాల, కేటీదొడ్డి మండలాల పరిధిలో 10వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యమున్న గోదాములు ఐదేళ్లుగా వృథాగా ఉన్నాయి. ఉమ్మడి జిల్లాలో అప్పట్లో 65 మండలాల పరిధిలో గోదాములు నిర్మించారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వ్యవసాయ శాఖ పరిధిలో ఉన్న గోదాముల్లో 4.50 లక్షల టన్నుల సామర్థ్యం ఉన్న గోదాములు అందుబాటులో ఉన్నాయి. అలాగే వ్యవసాయ మార్కెట్ కమిటీల పరిధిలో మొత్తం 17 చోట్ల దాదాపు 8లక్షల టన్నుల నిల్వ సామర్థ్యం ఉన్న గోదాములున్నాయి. జోగులాంబ జిల్లాలోనే 8 మండలాల పరిధిలో 55 వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యమున్న గోదాములున్నాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 16.25 లక్షల మెట్రిక్ టన్నుల వరిధాన్యం దిగుబడి రానుందని అంచనా. దీనికి అనుగుణంగా నిల్వకు ఇటు వ్యవసాయ శాఖ అటు పౌరసరఫరాల శాఖ సంయుక్తంగా ఏర్పాట్లు చేయాల్సి ఉంటుంది.

తుంగభద్రలో భారీగా పెరుగుతున్న ప్రవాహం



ఆర్డీఎస్ వద్ద తుంగభద్ర పరవళ్లు

శాంతినగర్, న్యూస్‌టుడే: తుంగభద్ర నదిలో ఆదివారం ప్రవాహం భారీగా పెరిగింది. జలాశయం ఎగువ ప్రాంతంలో భారీ వర్షాలు పడుతుండటంతో దాని నుంచి 80 వేల క్యూసెక్కులు దిగువకు వదులుతున్నారు. జలాశయం దిగువన నదీపరివాహక ప్రాంతాల్లో పడుతున్న వర్షాలకు మరో 17,880 క్యూసెక్కులు, మొత్తం 97,880 క్యూసెక్కుల ప్రవాహం ఆర్డీఎస్ ఆనకట్టకు వద్ద ఉంది. ఇది మరింత పెరిగే అవకాశం ఉంది. ప్రస్తుతం ఆనకట్ట వద్ద 12.8 అడుగుల ఎత్తులో నీటిప్రవాహం ఉన్నట్లు ఏఈ రాందాస్ తెలిపారు. ప్రధానకాల్వకు 8.5 అడుగుల నీటిని విడుదల చేస్తుండగా, రాష్ట్రానికి వచ్చేసరికి అది 5.2 అడుగులుగా ఉంది.

మాంసం ముక్క గొంతులో ఇరుక్కొని రైతు మృతి



కాకి వెంకటన్న

మదనాపురం, న్యూస్‌టుడే : మాంసం ముక్క గొంతులో ఇరుక్కుని శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది ఏర్పడి ఓ రైతు మృతి చెందారు. వనపర్తి జిల్లా మదనాపురం మండలం కొన్నూరు గ్రామానికి చెందిన రైతు కాకి వెంకటన్న (52) దసరా కనుమ పండగ సందర్భంగా ఆదివారం ఉదయం ఇంటికి మాంసం తెచ్చుకున్నారు. 10 గంటల సమయంలో అన్నం తింటుండగా మాంసం ముక్క గొంతులో ఇరుక్కుంది. శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది ఏర్పడి అస్వస్థతకు గురయ్యారు. వెంటనే కుటుంబ సభ్యులు చికిత్స కోసం కొత్తకోటలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు.

జాతీయ స్థాయి టార్గెట్‌బాల్ పోటీలకు ఎంపిక

మహబూబ్‌నగర్ క్రీడలు, న్యూస్‌టుడే : జాతీయస్థాయి అండర్-19 టార్గెట్‌బాల్ టోర్నీలో పాల్గొనే తెలంగాణ బాల,బాలికల జట్లకు ఉమ్మడి జిల్లా నుంచి ఆరుగురు ఎంపికయ్యారు. నవాబుపేట మండలం సిద్దోటంకు చెందిన ఎన్.కృష్ణ, కోయిలకొండ మల్కాపూర్‌కు చెందిన కె.నవీన్, కోయిలకొండ మండలం పారుపల్లిలోని శ్వేత విద్యామందిర్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న సుమిత్ర, నాగలక్ష్మి, కేదారేశ్వరి, పి.రాంచరణ్‌లు బాల,బాలికల జట్లకు ఎంపికయ్యారు. జూనియర్స్ టోర్నీ బిహార్‌లోని రాంసహాయ్ ఛాప్రాలో ఈనెల 16 నుంచి 19వ తేదీ వరకు నిర్వహిస్తున్నారు. క్రీడాకారులను టార్గెట్‌బాల్ సంఘం సభ్యులు ఉమామహేశ్, శీనయ్య తెలిపారు.

500 మిలియన్ యూనిట్లకు చేరిన విద్యుదుత్పత్తి

ఆత్మకూరు, న్యూస్‌టుడే : జూరాల జలాశయం వద్ద వరద ఉద్ధృతి కొనసాగుతున్న క్రమంలో ప్రస్తుత వర్షాకాలం ఎగువ, దిగువ కేంద్రాల్లో ఉత్పత్తి 500.600 మిలియన్ యూనిట్లకు చేరింది. ప్రాజెక్టుకు 42 వేల క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతుండగా విద్యుదుత్పత్తికి 37,267 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. గత 24 గంటల్లో ఎగువన ఐదు యూనిట్ల ద్వారా 3.143, దిగువన ఆరు యూనిట్ల ద్వారా 3.493 మిలియన్ యూనిట్ల ఉత్పత్తి జరిగింది. ప్రస్తుత సీజన్‌లో ఎగువన 261.142, దిగువన 239.458 మిలియన్ యూనిట్లకు ఉత్పత్తి చేరిందని ఎస్‌ఈ (ఓఅండ్‌ఎం) సూరిబాబు తెలిపారు.

సమాజహితాన్ని కోరిన సాయిబాబా

పాలమూరు అధ్యయన వేదిక కన్వీనర్ రాఘవాచారి



మహబూబ్‌నగర్: తెలంగాణ కూడలిలో సాయిబాబా చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎం.రాఘవాచారి, తదితరులు

పాలమూరు, న్యూస్‌టుడే: సమాజ మార్పుకై, భవిష్యత్తు తరాల కోసం జీవితాన్ని అంకితం చేసిన ఘనత ఆచార్య సాయిబాబాకే దక్కిందని పాలమూరు అధ్యయన వేదిక ఉమ్మడి జిల్లా కన్వీనర్ ఎం.రాఘవాచారి అన్నారు. ఈ మేరకు ఆదివారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రం తెలంగాణ కూడలిలో సాయిబాబా సంస్మరణ దినోత్సవాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. గత 15 రోజుల నుంచి తీవ్ర అస్వస్థతకు గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఈ నెల 12వ తేదీ రాత్రి చనిపోయారని అన్నారు. కేంద్ర ప్రభుత్వం పదేళ్ల నుంచి ఆయనపై అక్రమ కేసులు పెట్టి హింసకు గురి చేసిందని విమర్శించారు. సాయిబాబా 9 ఏళ్ల పాటు ఒంటరిగా జైల్ జీవితం అనుభవించారని చెప్పారు. కారాగారంలో సరైన చికిత్స అందించకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడ్డారని అన్నారు. జైలు శిక్షలో ఉండగానే మహారాష్ట్ర హైకోర్టు సాయిబాబాను నిర్దోషిగా ప్రకటించిందన్నారు. టీఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్‌ఎం ఖలీల్, డీటీఎఫ్ నాయకులు ఆదిత్య, వెంకటేశ్వర్లు, నాగభూషణం, వామన్‌కుమార్, తెలంగాణ ప్రజా ఫ్రంట్ నాయకులు మన్నెం కొండ, పాలమూరు అధ్యయన వేదిక నాయకులు తిమ్మప్ప, కేసీ వెంకటేశ్వర్లు, ఉదయమిత్ర తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబీకుల ఆందోళన



బాలానగర్: రోడ్డుపై ధర్నా చేస్తున్న మృతుడి కుటుంబ సభ్యులు

బాలానగర్, న్యూస్‌టుడే: మండలంలోని మొదంపల్లి గ్రామానికి చెందిన స్వామి(25) శుక్రవారం రాత్రి టిప్పర్ ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందిన విషయం విదితమే.. దీంతో బాధితుడి కుటుంబ సభ్యులు తమకు న్యాయం చేయాలంటూ మండల కేంద్రంలో జాతీయ రహదారిపై శనివారం ఆందోళన చేపట్టారు. ఈ క్రమంలో 2 గంటలకు పైగా ట్రాఫిక్ జామ్ నిలిచిపోయి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. స్పందించిన సీఐ నాగార్జున గౌడ్, ఎస్సై తిరుపాజీ టిప్పర్ డ్రైవర్‌పై చట్టపరంగా చర్యలు తీసుకుని న్యాయం చేస్తామని చెప్పడంతో ధర్నా విరమించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు టిప్పర్ డ్రైవర్ మంజుపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తిరుపాజీ తెలిపారు.

నాటు వైద్యం వికటించిన ఘటనలో ఇద్దరిపై కేసు

మహబూబ్‌నగర్ నేరవిభాగం: నాటు వైద్యంతో వ్యాధిని నయం చెద్దామనుకున్న వారికి అది వికటించడంతో ఇరువురిపై కేసు నమోదైన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గ్రామీణ ఠాణా ఎస్సై విజయ్‌కుమార్ వివరాల ప్రకారం.. పట్టణంలోని ఓ రాజకీయ నాయకుడు కొన్నేళ్ల నుంచి పక్షవాతంతో బాధ పడుతున్నారు. వ్యాధి పూర్తిగా నయం చేస్తామని బాధితుడికి తెలిసిన వ్యక్తి భరోసా కల్పించాడు. దీంతో అతను మరో నాటు వైద్యుడిని తీసుకొచ్చి గత నెల 21వ తేదీన ఇంట్లోనే చికిత్స చేశారు. కాళ్ల నుంచి శరీరమంతా చపాతీల కర్రతో కొట్టి అనంతరం శరీరంపై నాటు మందు వేశారు. దీంతో మరుసటి రోజు ఉదయం శరీరంపై దద్దులు వచ్చి పగిలిపోయాయి. ఈ విషయమై నాటు వైద్యం చేసి వెళ్లిన వారికి సమాచారం అందించగా వారు రాలేదు. దీంతో గత నెల 30న బాధితుడు రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.


కాల్వలోకి వాహనం దూసుకెళ్లి ఒకరు..



మహమ్మద్ బేగం

కందనూలు, న్యూస్‌టుడే : పత్తి తీయడానికి కూలీ పనులకు వెళ్తూ ఒకరు దుర్మరణం చెందగా మరో 12 మందికి తీవ్ర గాయాలైన సంఘటన ఆదివారం పట్టణంలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం... నాగర్‌కర్నూల్ మండలంలోని మంతటికి చెందిన 13 మంది కూలీలు అదే గ్రామ శివారులోని సర్వసతీ ఆలయ సమీపంలోని ఓ రైతు పొలంలో పత్తితీతకు వాహనంలో బయలుదేరారు. ప్రధాన రహదారి నుంచి పొలంలోకి వెళ్తుండగా వాహనం అదుపు తప్పి పక్కనే ఉన్న కేఎల్ఐ కాలువలోకి దూసుకెళ్లి బోల్తాపడింది. దీంతో అందులో ప్రయాణిస్తున్న మహమ్మద్ బేగం (45) అక్కడికక్కడే మృతి చెందగా మరో 12 మందికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గమనించి క్షతగ్రాతులను 108 వాహనంలో పట్టణంలోని జనరల్ ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే డా. కూచుకుళ్ల రాజేశ్‌రెడ్డి ఆసుపత్రిలో క్షతగాత్రులను పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. ప్రమాదంలో మృతి చెందిన మహిళ కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం ద్వారా ఆర్థిక సాయం అందజేస్తామని పేర్కొన్నారు. మహమ్మద్ బేగం కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై గోవర్ధన్ తెలిపారు.

విద్యుదాఘాతంతో రైతు..



జానకి రాములు

లింగాల, న్యూస్‌టుడే: విద్యుదాఘాతంతో రైతు మృతి చెందిన సంఘటన నాగర్‌కర్నూల్ జిల్లా లింగాల మండలం పద్మన్నపల్లిలో శనివారం రాత్రి చోటు చేసుకోంది. బంధువుల కథనం ప్రకారం.. రైతు పులిపాటి జానకి రాములు (60) శనివారం రాత్రి మొక్కజొన్న పంట కాపలా కోసం వెళ్తుండగా ప్రమాదవశాత్తు వ్యవసాయ బోరు తీగ కాలుకు తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. ఆదివారం ఉదయం కుటుంబ సభ్యులు వెళ్లి చూడగా విద్యుదాఘాతానికి గురై జానకిరాములు మృతి చెందినట్లు గుర్తించారు. భార్య, ముగ్గురు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.

చెక్‌డ్యాంలో పడి బాలుడు..

తాడూరు, న్యూస్‌టుడే : తాడూరు శివారు కొమ్ముగుట్ట సమీపంలోని చెక్‌డ్యాంలో ఆదివారం మధ్యాహ్నం బర్రెలను నీళ్లు తాగించేందుకు వెళ్లిన 11ఏళ్ల ఓ బాలుడు ప్రమాదవశాత్తు నీటిలోపడి మునిగిపోయాడు. గమనించిన చుట్టు పక్క రైతులు అక్కడి చేరుకొని నీటిలో నుంచి బయటికి తీయగా బాలుడు అప్పటికే మృతి చెందాడు.

వేడి నూనెలో పడి చిన్నారికి తీవ్ర గాయాలు



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న దినేశ్

వెల్దండ గ్రామీణం, న్యూస్‌టుడే: వేడి నూనెలో పడిన తొమ్మిదేళ్ల బాలుడికి తీవ్ర గాయాలైన ఘటన వెల్దండ మండల కేంద్రంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. దసరా పండుగ సందర్భంగా శనివారం ఉదయం వెల్దండలోని పాండు ఇంట్లో పిండి వంటలు చేశారు. భార్య పావని బాండీలో నూనెను అలాగే ఉంచారు. కుమారుడు చిన్నారి దినేష్ ఆడుకుంటూ అటుగా వచ్చి తగలడంతో బాండీలోని నూనెంతా కింద ఒలికింది. అందులోనే బాలుడు జారి పడటంతో ఒళ్లంగా తీవ్రంగా కాలింది. కల్వకుర్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో హైదరాబాద్ ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు.

దంపతుల మరణానికి కారణమైన వ్యక్తిపై కేసు

రేవల్లి(గోపాల్‌పేట), న్యూస్‌టుడే : వేరుసెనగ పైరును అడవి జంతువుల నుంచి కాపాడుకునేందుకు పొలం చుట్టూ విద్యుత్తు కంచె ఏర్పాటు చేసి ఇద్దరు వ్యక్తుల ప్రాణాలు పోవడానికి కారణమైన శానాయిపల్లి గ్రామానికి చెందిన బుడ్డ బాలయ్యపై కేసునమోదు చేశామని రేవల్లి ఎస్సై రాము తెలిపారు. రేవల్లి మండలంలోని కొత్తబండరావిపాకుల గ్రామానికి చెందిన బక్కన్న, నారమ్మ దంపతులు ఈనెల 11వ తేదీన సాయంత్రం సీతాఫలాలు తెంచుకుని రావడానికి శానాయిపల్లి గుట్టపైకి వెళ్లి తిరిగి వస్తుండగా గ్రామ శివారులో వేరుసెనగ పైరుకు రక్షణగా పెట్టిన విద్యుత్తు కంచె తగిలి అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. శానాయిపల్లి, కొత్తబండరావిపాకుల గ్రామాల్లో ఎలాంటి సంఘటనలు చోటు చేసుకోకుండా పాన్‌గల్ ఎస్సై శ్రీనివాసులు, రేవల్లి ఎస్సై రాము సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు. మృతుల కుమారుడు కాశీం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి శనివారం మృతదేహాలకు రేవల్లి ఆసుపత్రిలో పోస్టుమార్టం చేయించినట్లు పోలీసులు తెలిపారు.



చికెన్ ధరలు

ఫాంరేటు	126-00
రిటైల్	148-00
డ్రెస్డ్	215-00
స్కిన్‌లెస్	244-00

మేమున్నాం.. మీకు తోడుగా.. ఉ॥ 10 గం. నుంచి మ॥ 1 వరకు

మహబూబ్‌నగర్ : 9948145978 | జడ్చర్ల : 8008573899
దేవరకద్ర : 9000031648 | భూత్పూర్ : 8008563143

తెరపై ఈనాడు

శ్రీనివాస - **విశ్వం,** తిరుమల - **వెట్టయాన్,** బాలాజీ - **జనక అయితే గనక,** వెంకటేశ్వర - **దేవర,** వెంకటాద్రి - **మా నాన్న సూపర్ హీరో,** మైత్రి శ్రీకృష్ణ - **మార్టిన్**

– న్యూస్‌టుడే, మహబూబ్‌నగర్ పట్టణం

మిడ్జిల్‌లో సీఎం రేవంత్‌రెడ్డికి ఘన స్వాగతం

మిడ్జిల్, న్యూస్‌టుడే : స్వగ్రామంలో దసరా వేడుకలను ముగించుకుని శనివారం రాత్రి భారీ కాన్వాయ్‌తో కొడంగల్ వెళ్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ప్రధాన రహదారిపై నిలిపి మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘన స్వాగతం పలికారు. ముఖ్యమంత్రి వాహనంపై నిలబడి దారిపొడవునా అభివాదం తెలుపుతూ ముందుకెళ్లారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ ఛైర్‌పర్సన్ తంగెళ్లజ్యోతి, నాయకులు అల్వాల్‌రెడ్డి, ఎండీ.గౌస్, వెంకటయ్య, మల్లికార్జున్‌రెడ్డి, సంపత్‌కుమార్ సన్మానించారు.

● ముఖ్యమంత్రి మండల కేంద్రం మీదుగా వెళ్తున్న సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. నాయకుల జేబుల్లోంచి రూ.30వేల నగదు, చరవాణిని చోరీ చేశారు.

ఆలయాలను దర్శించుకున్న ప్రముఖులు



ఆలయంలో డీజీపీ జితేందర్ దంపతులు

అలంపూర్, న్యూస్‌టుడే: అలంపూర్ ఆలయాలను దసరా పర్వదిన సందర్భంగా డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ జితేందర్, ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ రమేష్‌రెడ్డి దంపతులు, కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఈవో పురేందర్, అర్చకులు, ఛైర్మన్ నాగేశ్వర్‌రెడ్డి, ధర్మకర్త సభ్యులు వారికి స్వాగతం పలికారు.

ఆది శిలాక్షేత్రం భక్తజన సందోహం



దేవుడిని పల్లకీలో ఊరేగిస్తున్న వాల్మీకి పూజారులు



ప్రత్యేక అలంకరణలో వేంకటేశ్వరస్వామి

మల్దకల్, న్యూస్‌టుడే: విజయదశమి పర్వదినాన్ని శనివారం కలిసి రావడంతో మల్దకల్ ఆది శిలాక్షేత్రానికి వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి పూజలు నిర్వహించారు. స్వామివారిని దర్శించుకుని ఉత్సాహంగా మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయంలో ఉదయం సుప్రభాతసేవ, గోపూజ, శాంతిహోమం, పంచామృతాభిషేకం, అలంకరణ, మంగళహారతి నిర్వహించారు. సాయంత్రం రథోత్సవం, పల్లకీసేవ, ఉత్సవ విగ్రహాల ఊరేగింపు, శమీవృక్షం పూజ, పవళింపు సేవను నిర్వహించారు. ఈసందర్భంగా గద్వాల సీఐ నాగేశ్వరరావు, తెదేపా మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

తీగలను అల్లుకుపోతున్నా పట్టించుకోరా..?



పాలకొండ బీసీకాలనీలో రహదారి పక్కనే విద్యుత్ లైన్‌కు అల్లుకుపోతున్న తీగలు.. కమ్మేసిన చెట్లు

పాలమూరు పురపాలకం, న్యూస్‌టుడే: మర్లు నుంచి పాలకొండ బైపాస్ వెళ్లే మార్గంలో బీసీకాలనీ వద్ద రహదారి పక్కనే ఉన్న విద్యుత్ స్తంభాల పొడవునా విద్యుత్ లైన్లకు పిచ్చి మొక్కల తీగలు అల్లుకుపోతున్నాయి. అక్కడే మరోచోట విద్యుత్ లైన్లను ఏపుగా పెరిగిన చెట్టు కమ్మేసింది. అసలే ఎక్కువ సామర్థ్యం కలిగిన విద్యుత్ లైను.. ఆపై పచ్చని పిచ్చిమొక్క తీగలు, చెట్లు అల్లుకుపోయి ప్రమాదంగా దర్శనమిస్తోంది. విద్యుత్‌శాఖ సిబ్బంది స్పందించి తీగలను కమ్మేసిన చెట్లను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.



మహబూబ్‌నగర్: రేణుకా ఎల్లమ్మ దేవాలయంలో ఎమ్మెల్యే యెన్నం పూజలు



మన్యంకొండలో.. జమ్మిచెట్టుకు



మహబూబ్‌నగర్: సింహగిరి లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో..



జడ్చర్ల: బాదేపల్లి జడ్పీహెచ్‌ఎస్‌లో..



దేవరకద్రలో రావణసురుడి దహనం

అంబరాన్నంటిన దసరా సంబరాలు



మహబూబ్‌నగర్: తితిదే ఆధ్వర్యంలో దసరా వేడుకల్లో శ్రీవారి భక్తులు

విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని శనివారం జిల్లావ్యాప్తంగా ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. సాయంత్రం పల్లెలు, పట్టణాల్లో జమ్మివృక్షానికి ప్రదక్షిణలు చేసి పూజించారు. పట్టణంలో రేణుకా ఎల్లమ్మ దేవాలయంలో ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, మున్సిపల్ ఛైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్ తదితరులు పూజలు చేశారు. మన్యంకొండలో దసరా వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. శేషవాహనధారియైన శ్రీనివాసుడికి దక్షిణకట్టపై కొలువుదీర్చి జమ్మిచెట్టుకు పూజలు చేశారు. దేవరకద్ర పట్టణంలో దసరా వేడుకలను ఘనంగా నిర్వహించారు. రామలీల మైదానంలో రావణసురుడిని దహనం చేశారు. భూత్పూర్ మండలంలో అమ్మవారిని భక్తుల కోలాహలం మధ్య ఊరేగించి నిమజ్జనం చేశారు. అన్నాసాగర్‌లో మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి శమీపూజలో పాల్గొన్నారు. నవాబ్‌పేట, కోయిలకొండ, అడ్డాకుల, మూసాపేట, మిడ్జిల్ మండలాల్లోని ఆయా గ్రామాల్లో షమి పూజలు, దేవిశరన్నవరాత్రి ఉత్సవాల్లో నిర్వహించారు. జడ్చర్ల పట్టణంలోని జడ్పీహెచ్‌ఎస్ సిగ్నల్‌గడ్డ పాఠశాల ఆవరణలో హిందూ ధార్మిక సంస్థల ఆధ్వర్యంలో భక్తి శ్రద్ధలతో ఉత్సవాలు నిర్వహించారు. రావణ దహనం చేశారు. పట్టణంలో కన్యకాపరమేశ్వరి ఆలయం నుంచి ఆదివారం అమ్మవారి ఉత్సవ విగ్రహ ఊరేగింపును నిర్వహించారు.

\- న్యూస్‌టుడే బృందం



భూత్పూర్ : అన్నాసాగర్‌లో శమీపూజ వద్ద మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి



మహబూబ్‌నగర్‌లో నాగశేషుడి బాణసంచా



మహబూబ్‌నగర్: హౌసింగ్‌బోర్డుకాలనీలో ధ్వజ ఊరేగింపు



దేవరకద్రలో జమ్మిచెట్టుకు పూజలు



భూత్పూర్ : శేర్పల్లి(బి)లో బతుకమ్మలతో మహిళలు



కోయిలకొండలో ఊరేగింపులో గ్రామస్థులు

21 నుంచి ఎస్‌ఏ-1 పరీక్షలు

అచ్చంపేట: ఈ నెల 21 నుంచి అన్ని యాజమాన్యాల పరిధిలోని పాఠశాలల్లో విద్యార్థులకు (ఎస్‌ఏ)-1 పరీక్షలు నిర్వహించాలని డీఈవో డా. గోవిందరాజులు తెలిపారు. ప్రాథమిక స్థాయిలో 1 నుంచి 5 తరగతులకు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఈ నెల 21 నుంచి 24 వరకు పరీక్షలు నిర్వహించాలని సూచించారు. 6, 8వ తరగతి విద్యార్థులకు ఈ నెల 21 నుంచి 28 వరకు ఉదయం 9.15 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు 7, 9వ తరగతి విద్యార్థులకు మధ్యాహ్నం 1 గంట నుంచి సాయంత్రం 4.15 గంటల వరకు, 10 విద్యార్థులకు ఉదయం 9.15 నుంచి మధ్యాహ్నం 12.15 గంటల వరకు పరీక్షలు నిర్వహించాలన్నారు.

చెడును రూపుమాపి అందరి జీవితాల్లో వెలుగులు నింపుదాం

వేడుకల్లో ఎంపీ డీకే.అరుణ, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

మహబూబ్‌నగర్ సాంస్కృతికం, న్యూస్‌టుడే: అందరి జీవితాల్లో విజయం చేకూరేలా శ్రీరామచంద్రుడు, దుర్గామాత ఆశీస్సులు ఉండాలని మహబూబ్‌నగర్ ఎంపీ డీకే. అరుణ, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి ఆకాంక్షించారు. దసరా ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో శనివారం రాత్రి ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల మైదానంలో వేడుకలు నిర్వహించారు. ముందుగా బ్రాహ్మణవాడలోని ఆర్యసమాజ్ నుంచి శోభాయాత్ర ప్రారంభమై రామ్‌మందిర్ చౌరస్తా చేరుకున్న తర్వాత ధర్మధ్వజాన్ని ఆవిష్కరించారు. ఎంపీ డీకే.అరుణ మాట్లాడుతూ.. చెడుపై విజయమే విజయదశమి అని పేర్కొన్నారు. నవరాత్రుల్లో దుర్గాదేవిని వివిధ అవతారాల్లో పూజించటమే కాకుండా మహిళలు బతుకమ్మ సంబరాలను జరుపుతూ తెలంగాణ సంస్కృతిని చాటారని అన్నారు. ఎమ్మెల్యే యెన్నం మాట్లాడుతూ.. మనలోని అవలక్షణాలను జయించినప్పుడే నిజమైన దసరా పండుగ అని అన్నారు. దసరా వైభవాన్ని చాటుతూ ప్రకాశం జిల్లాకు చెందిన హరినాథ్ ఆధ్వర్యంలో వేదిక సాగింది. రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఛైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్, మున్సిపల్ ఛైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్, సభా సమన్వయకర్తగా దసరా ఉత్సవకమిటీ కోశాధికారి కేవీఎస్. రవికుమార్ వ్యవహరించగా మార్కెట్‌కమిటీ ఛైర్‌పర్సన్ బెక్కరి అనిత, ఉత్సవకమిటీ గౌరవాధ్యక్షుడు డా.వి.మురళీధర్‌రావు, అధ్యక్షుడు చంద్రయ్య, చంద్రకుమార్‌గౌడ్, మల్లికార్జునరెడ్డి, బురుజు సుదర్శన్‌రెడ్డి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీ డీకే.అరుణ, చిత్రంలో ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు, తదితరులు

ధ్వజధారి అంజయ్యకు సత్కారం



అంజయ్యను సత్కరిస్తున్న భాజపా నాయకులు

మహబూబ్‌నగర్ గ్రామీణం, న్యూస్‌టుడే: ఈ ఏడాది దసరా ఉత్సవాలకు ధ్వజధారిగా పనిచేసి ఉత్సవాలు ప్రశాంతంగా నిర్వహించేందుకు కృషి చేసిన భాజపా నియోజకవర్గ కన్వీనర్, వీరన్నపేట కౌన్సిలర్ అచ్చుగట్ల అంజయ్యను భాజపా జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా సత్కరించారు. పార్టీలకు అతీతంగా ఉత్సవాల నిర్వహణకు కృషి చేశారని కొనియాడారు. భాజపా జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి రమేష్‌కుమార్, నాయకులు కృష్ణవర్ధన్‌రెడ్డి, హరికృష్ణ, విశాల్, ఆవుల నర్సింహా తదితరులు పాల్గొన్నారు

రాష్ట్రస్థాయి పోటీలకు బాస్కెట్‌బాల్ జట్టు పయనం



ఎంపికైన బాస్కెట్‌బాల్ సీనియర్స్ జట్టుతో సంఘం సభ్యులు

మహబూబ్‌నగర్ క్రీడలు, న్యూస్‌టుడే: రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు ఉమ్మడి జిల్లా సీనియర్స్ జట్టు పయనమైంది. ఆదివారం జిల్లా కేంద్రంలో డీఎస్‌ఏ మైదానంలో ఎంపికైన జట్టుకు సంఘం జిల్లా అధ్యక్షుడు జాకెర్ క్రీడాదుస్తులు అందజేశారు. పోటీల్లో సత్తా చాటి విజయం అందుకోవాలని ఆకాంక్షించారు. రాష్ట్రస్థాయి పోటీలు హైదరాబాద్‌లో ఈనెల 14, 15 తేదీల్లో నిర్వహిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి నస్రుల్లా హైదర్, సభ్యులు సుభాన్‌జీ, ఇలియాజ్, ఖాలెద్ అలి, ఖలీల్, ముక్రం, వహీద్‌షా పాల్గొన్నారు.

ఎంపికైన జట్టు ఇదే..: పృథ్వీరాజ్, ఎంఏ రాషద్, కె. ఉదయ్ కుమార్, అజహర్ మహబూబ్, ఎండీ సయీద్ అలి, ఎండీ ఖాజా సల్మాన్, వి.కిరణ్ కుమార్, అలి అబ్దుల్ బాసిత్, జి.రోహిత్ కుమార్, ఎండీ జకి, రామ్మోహన్‌రెడ్డి, అబ్దుల్ రాఫె సీనియర్స్ జట్టుకు ఎంపికయ్యారు.









మహబూబ్‌నగర్: బ్రాహ్మణవాడలో.. రాజరాజేశ్వరిమాత ఆలయంలో.. జడ్చర్లలో.. దేవరకద్రలో అమ్మవారి ఊరేగింపులో భక్తులు

లోకాలనేలే తల్లీ కరుణించమ్మా

దేవి శరన్నవరాత్రి వేడుకలు జిల్లా వ్యాప్తంగా శని,ఆదివారాల్లో అంగరంగ వైభవంగా కొనసాగాయి. చివరిరోజు దుర్గామాతగా అలంకరించి పూజించారు. కుంకుమార్చన, హోమాలు చేశారు. సాయంత్రం వేళ పల్లకిసేవ నిర్వహించారు. మహబూబ్‌నగర్ పట్టణంలోని పలు కాలనీల్లో సామూహిక పూజలు నిర్వహించారు. వెంకటేశ్వర,లక్ష్మీనగర్‌కాలనీలోని రాజరాజేశ్వరి మాత ఆలయంలో, రవీంద్రనగర్‌లోని పోచమ్మదేవాలయంలో దుర్గామాతగా అలంకరించారు. మహబూబ్‌నగర్ పట్టణం బ్రాహ్మణవాడలో వాసవీమాత ఆలయంలో శరన్నవరాత్రి ముగింపు ఉత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు రాఘవేంద్రశర్మ ఆధ్వర్యంలో నవదుర్గల ప్రతిమలకు ప్రత్యేక పూజలు చేశారు. దేవరకద్ర పట్టణ కేంద్రంతో పాటు, నాగారం, గద్దెగూడెం, కౌకుంట్ల, గోపన్‌పల్లి, వెంకటాయపల్లి, చిన్నరాజమూర్ గ్రామాల్లో అమ్మవారి శోభాయాత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. బాలానగర్ మండలంలోని ఉడిత్యాల ఉమా మహేశ్వరం ఆలయంలో దుర్గామాత అమ్మవారిని పురవీధుల గుండా ఊరేగించి నిమజ్జనం చేశారు. నవాబ్‌పేట మండలం పర్వతాపురం మైసమ్మ దేవతను రాజరాజేశ్వరిదేవిగా అలంకరణ చేశారు.

\- న్యూస్‌టుడే బృందం



నవాబుపేట: రుద్రారంలో అమ్మవారి విగ్రహాన్ని ఊరేగిస్తున్న గ్రామస్థులు



మహబూబ్‌నగర్: వాసవిమాత శోభాయాత్రలో ఆర్యవైశ్యులు



మహబూబ్‌నగర్: శోభాయాత్రలో నవదుర్గ రథాలు

ప్రభుత్వ కళాశాలలో దరఖాస్తులకు ఆహ్వానం

పాలమూరు, న్యూస్‌టుడే: మహబూబ్‌నగర్ పట్టణంలోని ప్రభుత్వ వృత్తి విద్యా జూనియర్ కళాశాలలో రెండు పోస్టులు ఖాళీగా ఉన్నాయని, దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ గోపాల్ ప్రకటనలో పేర్కొన్నారు. బోధన చేయడానికి కంప్యూటర్ సైన్స్, మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్ (ఎంపీహెచ్‌డబ్ల్యూ) కోర్సులలో అతిథి అధ్యాపకుల నియామకాలను చేపడుతున్నట్లు వివరించారు. దరఖాస్తులను ఈ నెల 15వ తేదీలోగా కళాశాలలో సమర్పించాలన్నారు.

ఆర్థిక సాయం అందజేత

బాలానగర్, న్యూస్‌టుడే : మండలంలోని తిరుమలగిరి గ్రామంలో నిరుపేద కుటుంబానికి చెందిన అంజయ్య కుమార్తె దివ్య వరంగల్ ప్రభుత్వ కళాశాలలో ఎంబీబీఎస్ సీటు సాధించారు. హైదరాబాద్‌లో సింగరేణి సీఎండీ బలరాం నాయక్ విద్యార్థినిని అభినందించి రూ.25వేలు అందజేశారు. డీసీఎంఎస్ ఛైర్మన్ ప్రభాకర్‌రెడ్డి రూ.20 వేలు, మాజీ వైస్ ఎంపీపీ వెంకటచారి రూ.10వేలు అందజేశారు.

కోయిలకొండ, న్యూస్‌టుడే : ఇబ్రహీంనగర్ గ్రామానికి చెందిన కేశవులు కుటుంబానికి ఆయన స్నేహితులు రూ.78వేలు అందించారు. కేశవులు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా.. 2010లో ఆయనతో పాటు పదో తరగతి చదివిన వారు శనివారం సాయమందించారు.

వైద్యుడి బలవన్మరణం



డా.రుషికేశ్

మహబూబ్‌నగర్ నేరవిభాగం, న్యూస్‌టుడే: ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పనిచేస్తున్న ఓ వైద్యుడు బలవన్మరణానికి పాల్పడిన ఘటన జిల్లా కేంద్రంలో ఆదివారం చోటు చేసుకుంది. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు తెలిపిన ప్రకారం.. జిల్లా కేంద్రంలోని శ్రీనివాసకాలనీకి చెందిన డా. రుషికేశ్ (35) మిడ్జిల్ మండలంలోని వేములలో పీహెచ్‌సీ తాత్కాలిక పద్ధతిపై వైద్యుడిగా పని చేస్తున్నారు. కుటుంబ కలహాలతో ఆదివారం ఇంట్లోనే ఫ్యానుకు ఉరేసుకున్నారు. అతని భార్య కూడా అదే మండలంలోని పసుపుల గ్రామంలో వైద్యురాలిగా పని చేస్తున్నారు. ఈ విషయమై రూరల్ ఎస్సై విజయ్‌కుమార్‌ను 'న్యూస్‌టుడే' వివరణ కోరగా తమకు ఇప్పటి వరకు ఎలాంటి సమాచారం రాలేదన్నారు. వివరాలను తెలుసుకుంటున్నట్లు తెలిపారు.

రైలు ఢీకొని వ్యక్తి దుర్మరణం

మహబూబ్‌నగర్ పట్టణం, న్యూస్‌టుడే: రైలు ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన మహబూబ్‌నగర్ రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం చోటు చేసుకుంది. రైల్వే ఎస్సై సయ్యద్ అక్బర్ కథనం మేరకు.. మహబూబ్‌నగర్ గ్రామీణ మండలం కోటకదిర రైల్వే స్టేషన్ సమీపంలో (45) ఏళ్ల వ్యక్తి పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని మృత్యువాతపడ్డారు. మృతదేహాన్ని జనరల్ ఆస్పత్రి శవాగారానికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ద్విచక్రవాహనం నుంచి పడి మృతి

మిడ్జిల్, న్యూస్‌టుడే : మండల కేంద్రంలో 167జాతీయ రహదారిపై ద్విచక్ర వాహనం అదుపుతప్పి బోల్తాపడటంతో ఒకరు తీవ్రంగా ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందినట్లు ఎస్సై శివనాగేశ్వర్‌నాయుడు తెలిపారు. శనివారం సాయంత్రం వాడ్యాల గ్రామానికి చెందిన కృష్ణయ్య (49) ద్విచక్రవాహనంపై వెళ్తూ కిందపడి తీవ్రంగా గాయపడ్డారు. స్థానికుల సాయంతో 108లో జిల్లా ఆసుపత్రికి అక్కడి నుంచి హైదరాబాద్‌కు తరలిస్తుండగా మృతిచెందినట్లు తెలిపారు. ఈ విషయంపై తమకు ఫిర్యాదు అందలేదని ఎస్సై చెప్పారు.

చెరువులో పడి వృద్ధురాలు..

బాలానగర్, న్యూస్‌టుడే: మతిస్థిమితం లేని ఓ వృద్ధురాలు చెరువులో పడి మృతి చెందిన ఘటన మండలంలోని ఉడిత్యాలలో ఆదివారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన పద్మమ్మ(70) మతిస్థిమితం సరిగా లేకపోవడంతో రెండు రోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లి తిరిగా రాలేదు. గ్రామ శివారు ఆదివారం ఉదయం చెరువులో శవం కనిపించడంతో గమనించిన వారు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్సై తిరుపాజీ తెలిపారు.

పిడుగుపాటుకు ఆవు..

దేవరకద్ర గ్రామీణం, న్యూస్‌టుడే : దేవరకద్ర మండలంలోని గుడిబండ గ్రామానికి చెందిన కొండారెడ్డి ఆవు పిడుగుపాటుకు మృతి చెందింది. పొలం వద్ద ఆవును చెట్టు కింద కట్టేసి ఉంచాడు. ఆదివారం సాయంత్రం వర్షం కురుస్తుండటంతో పిడుగు పడి ఆవు అక్కడికక్కడే మృతి చెందినట్లు రైతు తెలిపారు.

విద్యుదాఘాతంతో..

రాజాపూర్, న్యూస్‌టుడే: రాజాపూర్ మండల కేంద్రానికి చెందిన రైతు కప్పెరి గోపాల్‌రెడ్డి శనివారం పొలంలో పశువులను మేపుతుండగా అక్కడే ప్రమాదకరంగా ఉన్న విద్యుత్తు నియంత్రిక తీగలు తగిలి ఆవు ఆవు మృతి చెందింది. విద్యుత్తు తీగలు వేలాడుతున్నాయని అవి సరి చేయాలని పలుమార్లు విద్యుత్తు శాఖ అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని రైతు ఆవేదన వ్యక్త చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నియంత్రిక వద్ద ఉన్న సమస్యను పరిష్కరించాలని పరిసరాల రైతులు కోరుతున్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఏడుగురికి గాయాలు

దేవరకద్ర గ్రామీణం, న్యూస్‌టుడే : కారు, బస్సు ఢీకొని ముగ్గురికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. నారాయణపేటకు వెళుతున్న బస్సు, మహబూబ్‌నగర్ వైపు వస్తున్న కారు చిన్నచింతకుంట మండలం బండర్‌పల్లి వద్ద ఢీకొన్నాయి. కారులో ఉన్న ముగ్గురికి గాయాలు అయ్యాయి.

దేవరకద్ర గ్రామీణం, న్యూస్‌టుడే : లారీ, ద్విచక్రవాహనం ఢీకొని బల్సుపల్లి గ్రామానికి చెందిన రాములుకు తీవ్ర గాయాలు అయ్యాయని స్థానికులు తెలిపారు. చిన్నచింతకుంట మండలం బండర్‌పల్లి వద్ద ఎదురుగా వస్తున్న లారీ ద్విచక్ర వాహనాన్ని ఢీకొనడంతో రాములు కాలు విరిగిందని చెప్పారు.

మహమ్మదాబాద్, న్యూస్‌టుడే : ద్విచక్ర వాహనంపై నుంచి పడి వ్యక్తికి గాయాలైన ఘటన నంచర్లగేటు సమీపంలో ఆదివారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం... మహమ్మదాబాద్‌కు చెందిన శంకర్ తన ద్విచక్ర వాహనంపై నంచర్లగేట్ వైపు వెళుతుండగా ప్రమాదవశాత్తు కింద పడ్డారు. 108 వాహనంలో జిల్లా కేంద్రంలోని ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు.

బాలానగర్, న్యూస్‌టుడే: మండలంలోని ఓ గ్రామానికి చెందిన వ్యక్తి ద్విచక్రవాహనంపై మండల కేంద్రం నుంచి వెళ్తుండగా మార్గమధ్యలో అదుపుతప్పి గుంతలో పడటంతో తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రుడిని మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

మహమ్మదాబాద్, న్యూస్‌టుడే: ద్విచక్రవాహనంపై నుంచి కిందపడి వ్యక్తికి గాయాలైన ఘటన మండలంలోని నంచర్ల సమీపంలో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. నంచర్ల గ్రామానికి చెందిన కృష్ణ ద్విచక్రవాహనంపై నంచర్లగేట్ నుంచి స్వగ్రామానికి వెళుతుండగా కింద పడడంతో తలకు గాయమైంది. క్షతగాత్రుడిని 108లో జిల్లాకేంద్రంలోని ఎస్వీఎస్ ఆసుపత్రికి తరలించారు.

పట్టపగలే చరవాణి దుకాణంలో చోరీ

మహబూబ్‌నగర్ నేరవిభాగం, న్యూస్‌టుడే: పట్టపగలే చరవాణి దుకాణంలో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడిన సంఘటన జిల్లా కేంద్రంలో ఆదివారం చోటు చేసుకుంది. విశ్వసనీయ సమాచారం మేరకు.. జిల్లా కేంద్రం న్యూటౌన్ సమీపంలోని చరవాణి దుకాణంలో యజమాని మహమ్మద్ ముస్తాఫా ఆదివారం మధ్యాహ్నం సీసీ కెమేరాలు ఉండటంతో చోరీ కాదని దుకాణానికి తాళం వేయకుండా భోజనం చేయడానికి ఇంటికి వెళ్లారు. అదే అదునుగా గుర్తు తెలియని వారు షట్టర్ పైకెత్తి లోపలికి 25 చరవాణీలు చోరీ చేశారు. మరమ్మతుల కోసం వచ్చిన వినియోగదారులు యజమానికి సమాచారం అందించగా, వచ్చి చూస్తే చోరీకి గురైనట్లు గుర్తించాడు. దొంగలు సీసీటీవీ కెమేరాలనూ ఎత్తుకుని పోయారు. బాధితుడు రెండో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

ఫసల్ బీమా అమలుకు రంగం సిద్ధం

న్యూస్‌టుడే, దామరగిద్ద



దామరగిద్దలో వరిపైరు.

ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన అమలుకు కేంద్ర ప్రభుత్వం రంగం సిద్ధం చేసింది. ఈ పథకాన్ని ఎలా ముందుకు తీసుకెళ్లాలనే అంశంపై మహబూబానగర్‌లో రెండుసార్లు ఉమ్మడి జిల్లా వ్యవసాయ, ఉద్యాన, ప్రణాళిక అధికారులతో సమావేశం నిర్వహించారు. వ్యవసాయశాఖ ఉపసంచాలకుడు హాజరై చర్చ నిర్వహించారు. రైతులు, రైతుల సంఘాల నాయకుల అభిప్రాయలు తీసుకున్నారు.

ప్రయోజనాలు ఎక్కువే: ఈ పథకం అమలుతో రైతులకు బోలెడు ప్రయోజనాలు చేకురుతాయి. అనుకూల వాతావరణమే కాకుండా ఏ విధంగా పంట నష్టపోయినా బీమా వర్తిస్తుంది. వర్షాలు లేక పంట వేయకున్నా, సాగుచేసిన పంటలో అడవిపందులు, జింకల వంటి జంతువుల బెడదతో నష్టపోయినా పథకం వర్తిస్తుంది. ప్రకృతి వైపరీత్యాలకూ కవరేజీ ఉంటుంది. పంట కోత సమయంలో వడగళ్లవాన తదితర కారణలతో పంట నష్టపోతే బీమా వర్తిస్తుంది. రైతు యూనిట్‌గా అమలుచేస్తే ప్రయోజనమని కొందరు తమ అభిప్రాయం వ్యక్తం చేశారు.

వానాకాలంలో ఇలా...

- మహబూబ్‌నగర్ జిల్లాలో మక్కలు, జొన్న, కంది, పత్తి, టమటా పంటలకు మండలం యూనిట్‌గా తీసుకొని పథకం అమలు చేయనున్నారు. వరిపైరు మాత్రం గ్రామం యూనిట్‌గా తీసుకుంటారు.
- గద్వాల జిల్లాలో వరి, కంది, మక్క, వేరుశనగ, పత్తి, టమట పైర్లు మండలం యూనిట్‌గా తీసుకోనున్నారు.
- వనపర్తి జిల్లాలో జొన్న, వేరుశనగ, కంది, చెరకు, పత్తి, టమట పంటలకు మండలం యూనిట్‌గా అమలు చేస్తారు. వరిపైరు మాత్రం గ్రామం యూనిట్‌గా అమలవుతుంది.
- నాగర్‌కర్నూల్ జిల్లాలో మక్కలు, కంది, జొన్న, పత్తి పైర్లకు మండలం యూనిట్‌గా అమలు చేస్తారు. వరి పైరు మాత్రం గ్రామం యూనిట్‌గా తీసుకుంటారు.
- నారాయణపేట జిల్లాలో కంది, పత్తి, పెసర, జొన్న పైర్లు మండలం యూనిట్‌గా అమలవుతాయి. వరిపైరు గ్రామం యూనిట్‌గా అమలవుతుంది.
- రైతుకు పైసా ఖర్చు లేకుండా రాష్ట్ర ప్రభుత్వమే ప్రీమియం చెల్లిస్తున్నందున రైతులు ఈ పథకం వినియోగించుకోవాలని నారాయణపేట జిల్లా వ్యవసాయాధికారి జాన్ సుధాకర్ 'న్యూస్‌టుడే'తో అన్నారు.